
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.3 : కనిష్ఠం 23.2
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
శనివారం 20 జూలై 2024







పత్తి పంటలో కలుపు తీస్తున్న వ్యవసాయ కూలీలు

# అనుసంధానం.. ఇంకెప్పుడు?

- జిల్లాలో వ్యవసాయ కూలీలకు రోజురోజుకూ పెరుగుతున్న ప్రాధాన్యత
- వ్యవసాయ రంగానికి 'ఉపాధి' అనుసంధానంపై ఉసెత్తని కేంద్రం
- గ్రామాల్లో కూలీల కొరతతో వెనుకబడుతున్న పంటల సాగు పనులు
- విపరీతంగా పెరిగిన పెట్టుబడి ఖర్చులు
- నిషేధం ఉన్నా.. విచ్చలవిడిగా రౌండప్ మందుల వాడకం
- సాగుకష్టాలు తప్పడం లేదంటూ అన్నదాతల ఆందోళన
- జిల్లావ్యాప్తంగా ఈ యేడు 5.72 లక్షల ఎకరాలలో సాగవుతున్న పంటలు

ఆదిలాబాద్, జూలై 19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయమే ప్రధాన జీవనాధారమైన జిల్లా రైతులకు ఏటా సాగు కష్టాలు తప్పడం లేదు. ఆధునిక యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చినా.. వ్యవసాయ కూలీల ప్రాధాన్యత ఎక్కువగానే కనిపిస్తోంది. జిల్లాలో ఎక్కువగా వర్షాధార పంటలైన పత్తి, సోయా, కంది పంటలనే సాగు చేస్తుంటారు. నిత్యం ఓ మోస్తారు స్థాయిలో వర్షాలు కురవడం తో సాగు పనులకు ఆటంకంగా మారింది. దీంతో కలుపు మొక్కలు పెరిగి పోయి పంటలను కప్పేస్తున్నాయని అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో ఈ యేడు 5లక్షల 72వేల ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగవుతున్నట్లు వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే పంటల సాగు పనులు పూర్తికావడంతో కలుపు నివారణ, రసాయన మందుల పిచికారి, ఎరువులు వేయడం లాంటి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. దీంతో వ్యవసాయ కూలీలకు భారీగా డిమాండ్ ఏర్పడుతోంది. ఇలాంటి పరిస్థితులను దృష్టిలోపెట్టుకుని ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తామని గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించినా.. ఇప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. దీంతో యేటా రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే పంటల సాగు మరింత లాభసాటిగా మారే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ ఏళ్లు గడుస్తున్నా.. వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయడంపై కేంద్ర ప్రభుత్వం ఊసెత్తడమే లేదని రైతులు వాపోతున్నారు.

## డిమాండ్‌ను బట్టి కూలి

జిల్లావ్యాప్తంగా ఒకేసారి పంటలను సాగు చేయడం, కలుపు నివారణ, రసాయన మందుల పిచికారి పనులు ఊపందుకోవడంతో గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో డిమాండ్‌ను బట్టి కూలిని చెల్లించే విధానం కనిపిస్తోంది. కొన్ని గ్రామాల్లో గ్రామపెద్దల కట్టుబాట్లతో ఒకేరకమైన కూలిని నిర్ణయించిన కానీ, రైతుల అవసరాన్ని బట్టి గుట్టుచప్పుడుకాకుండా అధిక కూలిని చెల్లిస్తూ సాగు పనులను చేపడుతున్నారు. కొంతమంది రైతులైతే ముందుగానే అడ్వాన్స్‌లు చెల్లిస్తూ కూలీల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రస్తుతం పత్తి, కంది పంటలో కలుపు తీయడం, మందులను పిచికారి చేయడం లాంటి పనులు కొనసాగుతున్నాయి. సాధారణంగా గ్రామా ల్లో సీజన్‌ను బట్టి కూలీల చెల్లింపులుంటాయి. కానీ ప్రస్తుతం కూలీల డిమాండ్‌ను బట్టి కూలి చెల్లించే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మహిళ కూలీలకు రోజు కు రూ.300 నుంచి రూ.400ల వరకు చెల్లిస్తుండగా.. మగవారికి రూ.400 నుంచి రూ.600ల వరకు చెల్లిస్తూ.. అదనంగా మద్యానికి డబ్బులు ఇవ్వాల్సి వస్తుంది. ఈ లెక్కన ఒక్కో కూలీ రోజుకు రూ.700 వరకు సంపాదిస్తున్నట్లు తెలుస్తుంది.



## కూలీల కొరతతో తప్పని పిచికారీ

సమయానికి కూలీలు దొరక్క పోవడంతో గత్యంతరం లేక తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు నిషేధిత రౌండప్ మందులను పిచికారి చేస్తూ పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే రౌండప్ మందుల (గడ్డి మందు)పై నిషేధం ఉన్నా.. గుట్టుచప్పుడు కాకుండా రైతులు పంటల పొలాల్లో పిచికారి చేస్తూ కలుపు మొక్కలను నివారిస్తున్నారు. స్థానిక వ్యాపారులు బ్లాక్‌లో రౌండప్ మందులను విక్రయిస్తున్నారు. అలాగే మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తు పిచికారి చేస్తున్నారు. కూలీల కొరతతో రౌండప్ మందుల వాడకం ప్రమాదమని తెలిసినా తప్పడం లేదంటున్నారు. ఇప్పటికే పెరిగిపోయిన పెట్టుబడి ఖర్చులకు అదనంగా కూలీల రేట్లు పెరిగిపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ఎకరాన రూ.15 వేల వరకు ఖర్చు చేశామని.. పంట చేతికి వచ్చే వరకు మరో రూ.10 వేలకు పైగానే ఖర్చు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పెరిగిపోతున్న కూలి ధరలతో వ్యవసాయానికంటే కూలీ చేసుకోవడమే మేలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత చేసిన పంట చేతికి వచ్చే వరకు భరోసా లేదని రైతులు చెబుతున్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే పెట్టుబడి ఖర్చులు తగ్గి వ్యవసాయం లాభసాటిగా మారుతుందని చెబుతున్నారు.



### ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలెబెట్టుకోవాలి

: సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక, జిల్లా అధ్యక్షుడు

రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలి. వ్యవసాయానికి ఉపాధి పథకాన్ని అనుసంధానం చేస్తే నిరుపేదలకు ఉపాధిని కల్పించడంతో పాటు రైతులకు మేలు జరుగుతుంది. వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు తగ్గి ఆదాయం వస్తుంది. చెరువులు, చెట్లు, గుట్టలపై పనులు చేపట్టేకన్న.. పంటల సాగు పనుల్లో కూలీలు పనిచేసే విధంగా చర్యలు తీసు కుంటే సమయానికి సాగుపనులు గట్టెక్కే అవకాశం ఉంటుంది. దీంతో ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడంతో పాటు రైతులకు ఇబ్బందులు దూరమవుతాయి.



## సంక్షిప్త సమాచారం

### నేడు ఎమ్మెల్యే విత్ పీపుల్స్

ఉట్నూర్, జూలై 19: ఖానాపూర్ నియోజక వర్గంలోని ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకోవడానికి శనివారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు ఎమ్మెల్యే విత్‌పీపుల్స్ ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బొజ్జుపటేల్ తెలిపారు. నియోజకవర్గంలోని ఉట్నూర్, సిరికొండ, ఇంద్రవెల్లి, కడెం, ఖానాపూర్, పెంబి, దస్తూరాబాద్ జన్నారం మండలాల ప్రజలు తమ సమస్యలను నేరుగా ఫోన్ ద్వారా తెలపాలని, ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### రోడ్డు భద్రతపై అవగాహన

ఆదిలాబాద్ అర్బన్, జూలై 19: ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ వద్ద ప్రయాణికులకు ఆర్టీసీ ఆధ్వర్యంలో రోడ్డుభద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డుపై సూచనలను తప్పకుండా పాటించాలని, మోటార్ బైక్ నడిపేవారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే హెవీ మోటార్ డ్రైవింగ్ శిక్షణ తరగతుల గురించి యువకులకు వివరించారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలన్నారు. ఇందులో నారాయణ, యూసఫ్, బస్ ఆఫీసర్ సతీస్ ఉన్నారు.

### బ్యాంకుల వద్ద రైతుల సందడి

సోనాల, జూలై 19: రాష్ట్ర ప్రభుత్వం గురువారం రూ.లక్ష లోపు రుణ మాఫీ ప్రారంభించిన నేపథ్యంలో బ్యాంకుల వద్ద అధిక సంఖ్యలో రైతుల రాకతో సందడి నెలకొన్నది. సోనాలలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు, ఏడీసీసీ బ్యాంక్‌ల వద్ద తమ రుణ వివరాలు తెలుసుకోవడానికి రైతులు బారులు తీరడంతో రద్దీ నెలకొంది. అలాగే రుణమాఫీ ద్వారా లబ్ధిపొందిన రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే టీజీబీ బ్యాంకు మేనేజర్ నరేందర్‌శర్మ మాట్లాడుతూ బ్యాంక్ నుంచి ఎలాంటి ఫోన్‌కాల్స్ గాని, ఓటీపీలు రావని, సైబర్ క్రైం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఖాతాదారులకు ఆయన సూచించారు.

### పోస్టర్ల ఆవిష్కరణ

ఉట్నూర్, జూలై 19: హైదరాబాద్ ఈనెల 26, 27, 28వ తేదీల్లో నిర్వహించే ఫొటో ఎక్స్పో కార్యక్రమం పోస్టర్లను ఎమ్మెల్యే బొజ్జుపటేల్ శుక్రవారం మండల కేంద్రలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఇందులో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేశ్, మండల అధ్యక్షుడు సేవదాస్, ప్రధాన కార్యదర్శి రూబెన్‌తో పాటు ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

# రుణమాఫీ డబ్బులు ఏం చేస్తావ్?

- రైతులను ఆత్మీయంగా పలకరించిన కలెక్టర్ రాజర్షిషా
- ఇచ్చోడలో పలు బ్యాంకులలో ఆకస్మిక తనిఖీలు
- రుణమాఫీ ప్రక్రియ పరిశీలన



ఇచ్చోడలోని ఎస్బీఐ బ్యాంకులో ఓ రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్

ఇచ్చోడ, జూలై 19: రైతు రుణమాఫీ పథకం అమలు తీరును కలెక్టర్ రాజార్షి షా శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇచ్చోడ మండల కేంద్రంలో ఎస్బీఐ, తెలంగాణ గ్రామీణ బ్యాంకు, సహకార బ్యాంక్‌లను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇచ్చోడ ఎస్బీఐ బ్యాంకులో ఓ రెతును పలకరిస్తూ రుణమాఫీ వచ్చిందా? లేదా? అని వచ్చిన డబ్బులను ఏం చేస్తావ్? ఎలా ఉపయోగిస్తావ్? అని రైతుతో ఆత్మీయంగా పలకరించిన పిలుపునకు రైతు ఆనందంతో మురిసిపోయాడు. బ్యాంకులో ఉన్న రైతులందరికీ రుణమాఫీ పడిందా? సంతోషమేనా? అంటూ రైతులతో ముచ్చటించారు. ఆకస్మికంగా తనిఖీ చేసి బ్యాంకుల్లో జరుగుతున్న ప్రాసెస్‌ను, రైతుల లిస్టును పరిశీలించారు. బ్యాంకులకు వచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎక్కువ మంది సిబ్బంది తొందరగా రైతుల పనులను పూర్తిచేసి వారి ఖాతాలో డబ్బులు జమ చేయాలని బ్యాంకు మేనేజర్‌లకు వివరించారు. అనంతరం మండలంలోని అడేగాం(కె) గ్రామంలోని శివారులో నెం.46లో గల 18ఎకరాల భూమిలో సమీకృత పాఠశాలల భవనాల నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందులో తహసీల్దార్ తుకారాం, మండల విద్యాధికారి ఉదయ్ రావు, డీటీ రామారావు, బ్యాంకు మేనేజర్లు, తదితరులు పాల్గొనారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవో

### విద్యార్థులను అభినందించిన కలెక్టర్, ఎస్పీ

**ఆదిలాబాద్ అర్బన్:** జాతీయస్థాయి అర్చరీ పోటీలకు ఎంపికైన ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికల) చించుఘాట్ విద్యార్థులను కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ గౌస్‌ఆలంలో అభినందించారు. శుక్రవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో మడావి రూపా, పెందూర్ శ్రీజలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వీరి క్రీడా నేపథ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించేందుకు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాల విద్యార్థులు హాకీ, ఖోఖో, అథ్లెటిక్స్, అర్చరీ క్రీడాంశాల్లో గిరిపుత్రులు సాధిస్తున్న విజయాలను కలెక్టర్‌కు వివరించారు. చెన్నైలో ఈనెల 23నుంచి 26వరకు జరిగే జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఎం.దిలీప్‌కుమార్, జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, పీడీ రవీందర్, కోచ్ మారుతి, తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టర్ వాహనానికీ తప్పని పరీక్ష!!

ఇచ్చోడ, జూలై 19: ఇచ్చోడ మండలకేంద్రంలో కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులు వాహనాలకు ఎంత పరీక్ష పెడుతున్నాయో.. తెలుపుటకు నిదర్శనం ఈ చిత్రం. శుక్రవారం మండల కేంద్రంలోని పలు బ్యాంకుల సందర్శనకు వచ్చిన జిల్లా కలెక్టర్ వాహనానికి కూడా ఈ తిప్పలు తప్పలేదు. విస్తరణ పనులు పూర్తి కాకపోవడంతో పట్టణంలో అక్కడక్కడ ఇలా వరదనీరు నిలిచి గుంతలా మారాయి. ప్రత్యామ్నాయమార్గం లేకపోవడంతో వాహనాలన్నీ వరదనీటిలో నుంచి ప్రయాణిస్తున్నాయి. శుక్రవారం జిల్లా కలెక్టర్ వాహనం వరదనీటిలో నుంచి వెలుతున్నపుడు తీసిన చిత్రమే ఇది!!

వర్షపునీటిలో నుంచి వెళుతున్న కలెక్టర్ వాహనం





పరిశీలిస్తున్న జిల్లా మలేరియా నివారణాధికారి శ్రీధర్

### 'పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూడాలి'

ఆదిలాబాద్ రూరల్, జూలై 19: దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, అలాగే పారిశుధ్యం పాటిస్తూ, దోమలను నివారిస్తేనే కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని జిల్లా మలేరియా నివారణాధికారి శ్రీధర్ సూచించారు. ముందు జాగ్రత్తలు పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటు వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని సూచించారు. డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా జిల్లాకేంద్రంలోని మోచీగల్లీలో డెంగ్యూ వ్యాధి నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఐఎస్‌వో వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

### 'హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం'

ఉట్నూర్, జూలై 19: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో 44 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాగా, చెక్కుల పంపిణీ కార్యక్రమక స్థానిక అధికారులు ఎవరూ లేకపోవడంతో ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యుం, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్‌ఇక్బాల్, నాయకులు దూట రాజేశ్వర్, నీలాబాయి, అన్నపూర్ణ, తదితరులున్నారు.

# నేడు నాటే మొక్కలే.. రేపటి వృక్షాలు కావాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- ఇచ్చోడలోని జడ్పీ పాఠశాలలో 'వన మహోత్సవం'
- నేరడిగొండ, తాంసిలలో చెక్కుల పంపిణీ

ఇచ్చోడ, జూలై 19: ఇచ్చోడ జిల్లా పరిషత్తు పాఠశాల ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ అధికారులతో కలిసి బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. శుక్రవారం ఇచ్చోడ పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మొదటగా మొక్కలు నాటి ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. విశాలమైన పాఠశాలలో ఇరువైపులా మొక్కలు నాటాలని వాటిని సంరక్షించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఇచ్చోడకు చెందిన భోజన్న అనే వ్యక్తికి మంజూరైన రూ. 36వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును



ఇచ్చోడలో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

అందజేశారు. ఇందులో అటవీశాఖ ఎఫ్‌ఆర్‌వో టి.పుండలిక్, ఎంఈవో ఉదయ్‌రావ్, హెచ్‌ఎం సురేష్, జోషి డూప్యూటి ఎఫ్‌ఆర్‌వో శిలానంద్, ఎఫ్‌బీవో నౌషిలాల్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, చదువుకున్న పాఠశాలకు సేవచేయడం గొప్ప అవకాశమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోనే దాదాపు 1200 మంది విద్యార్థులు చదవుకునే అతిపెద్ద పాఠశాల స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అని.. ఈ పాఠశాలలోనే చదివి ఎమ్మెల్యే అయ్యానని విద్యార్థులతో వివరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు పాఠశాలలో డ్రీమ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు సెన్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. ఇందులో డ్రీమ్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కృష్ణరెడ్డి, ఎంఈవో ఉదయ్‌రావ్, మండల కన్వీనర్ ఎనుగు కృష్ణరెడ్డి, మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మాజీ సర్పంచ్ లోక శిరిష్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్, దేవేందర్‌రెడ్డి, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

### 'అధికారం కోసం రేవంత్ అబద్ధాలు ఆడారు'

**నేరడిగొండ:** మండల కేంద్రంలో నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 26 మంది లబ్ధిదారులకు రూ.1,00,116 చొప్పున మొత్తం రూ.26,03,016 కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. అదేవిధంగా బోథ్ మండలానికి చెందిన ఇద్దరికి రూ.33వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి అధికారం కోసం అబద్ధాలు ఆడి సీఎం అయ్యారని, ఇప్పుడు తులం బంగారం తావెక్కడ? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్‌సజన్, నానక్‌సింగ్, కృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి, సురేందర్, గులాబ్, పండరి, పాండురంగ్, ప్రతాప్, తిత్రేమెర్సింగ్, తదితరులున్నారు.

**తాంసి:** మళ్లీ రానున్నది కేసీఆర్ ప్రభుత్వమేనని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బండలనాగపూర్ గ్రామంలో 105 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో సరైన రీతిలో అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీ, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు ఉన్నారు.



నేరడిగొండలో లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తూ..

## సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

భీంపూర్, జూలై 19 : రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసిన సందర్భంగా శుక్రవారం మండలంలోని పిప్పల్‌కోటిలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దాసరి రమేష్, ఆకిటి అశోక్ రెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం మరెన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుందన్నారు. ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, రెండ్ల గోవర్ధన్, జలిగిరి మల్లేష్, మార్సెట్టి దేవదాస్, అశోక్, సత్య, నారాయణ పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి యువకుడి మృతి

తలమడుగు, జూలై 19: మండలంలోని లక్ష్మీపురం గ్రామ పంచాయతీ పరిధిలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన ఆత్రం విశాల్(18) అనే యువకుడు పురుగుల మందు సేవించి మృతిచెందినట్లు ఎస్సై నారాయణ తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామపంచాయతీ పరిధిలో గల బూరుపులి గ్రామానికి చెందిన ఆత్రం విశాల్ రెండు సంవత్సరాల నుంచి తాగుడికి బానిసై ప్రతి రోజు మద్యం సేవించడంతో ఈ విషయమై తన తండ్రి మందలించాడు. తాగిన మైకంలో క్షణిక ఆవేశంతో పురుగుల ముందు తాగి స్పృహ తప్పి పడిపోయాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుంబసభ్యులు తెలిపారు.

## చెరువులో పడి ఒకరి మృతి

గుడిహత్నూర్, జూలై 19: మండలంలోని ముత్నూర్ గ్రామ సమీపంలో ఉన్న చెరువులో శుక్రవారం ప్రమాదవశాత్తు జారిపడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రవెల్లి మండలం శంకర్‌గూడకు చెందిన బాలేరావ్ బాబు (50) మండలంలోని ముత్నూర్‌లో ఉన్న బంధువుల ఇంటికి గురువారం వచ్చాడు. బంధువులైన ఇద్దరితో కలిసి ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి చెరువు వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు చెరువులో జారి పడి నీటిలో మునిపోయాడు. వెంట ఉన్న వారు గ్రామస్థులతో పాటు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహన్ని బయటకు తీశారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి మేనల్లుడు క్రాంతి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఆర్‌ఎంపీల హర్షం

ఆదిలాబాద్ రూరల్, జూలై 19: ఆర్‌ఎంపీల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బేల మండలకేంద్రంలో శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎంరేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీలు వైద్య విఠల్, కృష్ణ, సుభాష్ ఊరడే, మారుతి, దేవిదాస్, సూర్యకాంత్ పాల్గొన్నారు.

# 'రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట'


కజ్జర్లలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

తలమడుగు, జూలై 19: రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేపడుతున్న సందర్భంగా శుక్రవారం మండలంలోని కజ్జర్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పుర వీధుల గుండా నిర్వ హించిన ఎడ్లబండ్ల ర్యాలీలో ఆడే గజేందర్ పాల్గొని రైతులతో కలిసి ఎడ్ల బండి నడిపారు. అనంతరం రైతు వేదికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మండల కన్వీనర్ కళ్యాణ రాజేశ్వరితో కలిసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ జడ్పీ టీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణలక్ష్మీ రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ కమ తలాకర్, వెంకన్న యాదవ్, టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మాజీకార్యదర్శి చింతలపల్లి దేవారెడ్డి, పోశెట్టి, శ్రీనివాస్, పూర్ణ చందర్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ తక్కువ వచ్చిందని రైతుల ఫిర్యాదు

తలమడుగు, జూలై 19 : తలమడుగు బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర ద్వారా రైతులు తీసుకున్న రుణాలకు గాను తక్కువ రావడంతో రైతులు ఆందోళన చెంది మండల వ్యవసాయ అధికారి మహేందర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ తలమడుగు గ్రామానికి చెందిన రైతులు గత సంవత్సరం పంట పెట్టుబడి కోసం బ్యాంకులో రుణాలు తీసుకున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో తక్కువగా వచ్చిందన్నారు. తలమడుగు గ్రామానికి చెందిన మంత్రి సత్యపాల్ గత సంవత్సరం సెప్టెంబరులో రూ.85399 లోన్ తీసుకోగా తనకు రుణమాఫీ కింద రూ.52403 వచ్చాయన్నారు. మరో రైతు బడగిరి శ్రీకాంత్‌కు గత సంవత్సరం లక్షా 25 వేలు లోన్ తీసుకోగా రుణమాఫీ కింద రూ.72 వేలు వచ్చాయన్నారు. అదే విధంగా మరో రైతు రవికి లక్షా 16 వేలు తీసుకోగా రుణమాఫీ కింద రూ.68 వేలు మాత్రమే వచ్చాయన్నారు. ఇంతేకాకుండా ఎందరో మంది రైతులకు లోన్ ఎక్కువగా ఉన్నప్పటికీ తక్కువగా వచ్చిందని, ఈ విషయమై మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయగా స్పందించిన ఏవో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపడతానని హామీనిచ్చారు.

**పలుచోట్ల రైతుల సంబరాలు...**

రైతులకు రుణమాఫీ చేయడంతో శుక్రవారం తలమడుగు మండల కేంద్రంలో రైతులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నల్ల పద్మాకర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, రావుల నారాయణ, కాటిపల్లి రాకేష్‌రెడ్డి, కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, అండే నారాయణ, స్వామి రెడ్డి, మేకల రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి పంట ఎండిందని పోలీసులకు ఫిర్యాదు

తలమడుగు, జూలై 19 : మండలంలో పల్సీకే గ్రామానికి చెందిన సీడం శివాల్ గిరిజన రైతు తన వ్యవసాయ పొలంలో కలుపు మొక్క లనివారణ కోసం గడ్డి మందులు పిచికారి చేయగా పత్తి పంట ఎండి పోయిందని ఈ విషయాన్ని సంబం ధిత మందుల దుకాణం యజమాని ఫిర్యాదు చేయగా స్పందించ లేదన్నారు. శుక్రవారం తలమడుగు పోలీస్ స్టేషన్ ఎస్సై నారాయణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ తనకున్న వ్యవసాయ పొలంలో పత్తి పంట సాగు చేస్తు న్నానని, పత్తిపంటలో కలుపు మొక్కలు ఏపుగా పెరగడంతో కలుపు మొక్కల నివారణ కోసం కుచలాపూర్ గ్రామంలో గల శివ సాయి మందుల దుకాణంలో మందులు కొనుగోలు చేసి పంటల పిచి కారి చేయగా పత్తి పంట మొత్తం వాడి ఎండిపోయిందన్నారు. మందులు వాడటం వల్ల పత్తి పంట నష్టం జరిగిందని, తనకు న్యాయం చేయా లని కోరారు. అనంతరం గిరిజన రైతుకు మద్దతుగా తుడుం దెబ్బ జిల్లానాయకులు జ్ఞానేశ్వర్, మనోజ్ మద్దతు తెలిపారు.

## పాఠశాలలో నాణ్యమైన భోజనం వడ్డించాలి

● సీపీవో వెంకటరమణ

తాంసి, జూలై 19 : కస్తూర్బా పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సీపీవో వెంకటరమణ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం తాంసి కస్తూర్బా పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారో లేదో విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలను ప్రత్యేకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీవో మాటాడుతూ విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివినప్పుడే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. ప్రతి బాలిక తమవంతుగా మూడు మొక్కలను నాటి వాటిని పెంచి పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సౌజన్య, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు

## అవినీతి హద్దు మీరడంతోనే అవిశ్వాసం : బీఆర్ఎస్ మైనార్టీ విభాగం

ఆదిలాబాద్ అర్బన్, జూలై 19: మున్సిపల్‌లో మాజీ వైస్‌చైర్మన్ జహీర్ రంజాని అవినీతి, ఆగడాలు హద్దు మీరడంతోనే అవిశ్వాసం ప్రవేశ పెట్టడానికి ప్రధాన కారణమని బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ విభాగం నాయకులు సలీం స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేత కంది శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించిన ఆయన వైస్ చైర్మన్ అవిశ్వాసం కోసం కాంగ్రెస్ కౌన్సిలర్లు సైతం సంతకాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జహీర్ రంజాని కాంగ్రెస్‌లో చేరేటప్పుడు సొంత పార్టీకి చెందిన మైనార్టీ నేతలు తీవ్రంగా వ్యతిరేకించారని పేర్కొన్నారు.బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోయాయని చేసిన వ్యాఖ్యలను ఖండించారు. మాజీ మంత్రి జోగు రామన్న మైనార్టీల సంక్షేమం కోసం విశేష కృషి చేశారని, భవిష్యత్తులోను తిరిగి వైస్‌చైర్మన్ ఎన్నిక జరిగితే ముస్లిం అభ్యర్థినే నిలబెడతారని స్పష్టం చేశారు. ఇందులో కౌన్సిలర్ ఇమ్రాన్, మోబిన్, సలీం, తదితరులున్నారు.

## 'ముదిరాజ్‌లను బీసీ ఏ లో చేర్చాలి'

బోథ్, జూలై 19: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఇచ్చిన జీవో 17 యధావిధిగా అమలు చేయాలని, అంతేగాక ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలని ముదిరాజ్ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ భూమేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. ముదిరాజ్ సామాజిక వర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలని, అందుకు గాను రాజకీయంగా కార్పొరేషన్ పదవులతో పాటు రాజ్యసభలో సముచిత స్థానం కల్పించాలని వారు వినతిపత్రంలో కోరారు. ముదిరాజ్‌లను నిర్లక్ష్యం చేస్తే సమీప భవిష్యత్తులో ఉద్యమించక తప్పదని వారు పేర్కొన్నారు. ఇందులో మండల అధ్యక్షుడు జంగాల భోజన, ప్రధాన కార్యదర్శి నాయుడు శ్రీనివాస్, కోశాధికారి మహిపాల్, మండల మాజీ అధ్యక్షులు సున్నపు శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు నిండు శ్రీనివాస్, తదితరులున్నారు.

## కిరాణా షాపులలో గుట్కా స్వాధీనం

బోథ్, జూలై 19: బోథ్, సోనాలలో శుక్రవారం ఎస్సై రాము ఆధ్వర్యంలో పలు కిరాణా షాపులపై దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా పలు దుకాణాలలో గుట్కా అమ్ముతున్నట్లు తేలడం జరిగిందన్నారు. అయితే, బోథ్‌లో రూ.26,318 విలువైన గుట్కా ప్యాకెట్లను పట్టుకోగా.. సోనాలలో రూ.8,400 విలువైన గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు బోథ్ ఎస్సై బి.రాములు పేర్కొన్నారు.

## 21న ఆదివాసీ సేన ఉమ్మడి జిల్లా కమిటీ సమావేశం : ఉయిక లక్ష్మణ్

గుడిహత్నూర్, జూలై 19: ఈ నెల 21న మండల కేంద్రంలోని జవహర్ నగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించే ఆదివాసీ సేన ఉమ్మడి జిల్లాస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు ఉయిక లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ కొమురం భీమ్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలోని ఆదివాసి సేన నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సేన మండల అధ్యక్షుడు సేడ్మకి భీంరావ్, ఆదివాసీ విద్యార్థి సేన జిల్లా కన్వీనర్ కుంరం చత్రుఘన్, ఆదివాసి మండల కోశాధికారి సలాం జాకు, ఆదివాసి సేన నాయకులు రాయిసిడం, భూపతి, దుర్వ జంగు, కుంరం సంభూ, తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో ఆదిలాబాద్‌లో సీఎం పర్యటన

● సీఎం రాక సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు : జిల్లా కలెక్టర్ రాజర్షిషా ● అధికారులతో సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షిషా



పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 19: త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు చేసేందుకు ఆదిలాబాద్ జిల్లాకు రానున్న సందర్భంగా ఏర్పాట్లపై ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షిషా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తాతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లా పర్యటన సందర్భంగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించేందుకు ఆయాశాఖలకు విధులను కేటాయించడం జరిగిందన్నారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో హెలిప్యాడ్ వద్ద షామియానా, కుర్చీలు, బారికేడ్ ఏర్పాట్లు చేయాలని, రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో మహిళా శక్తి క్యాంటిన్, ఎంఆర్ఐ స్కానర్, కేజీబీవీ హైస్కూల్, బంగారిగూడ, కమాండర్ కంట్రోల్ సెంటర్, మదర్‌పౌల్రి యూనిట్‌లను ఒకే చోట బటన్ క్లిక్ చేసి ప్రారంభిస్తారని తెలిపారు. టీటీడీసీలో ఏర్పాటు చేసిన సమావేశానికి, లంచ్, తదితర ఏర్పాట్లను ప్రత్యేకశ్రద్ధతో అధికారులకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలని, శానిటేషన్ పై ప్రత్యేకశ్రద్ధ వహించాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ గౌస్‌ఆలం మాట్లాడుతూ పోలీసు బందోబస్తు పకడ్బందీగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వద్ద గట్టి పోలీసు బందోబస్తుతో పాటు అత్యవసరమైన వారిని మాత్రమే లోనికి పంపించేందుకు చర్యలు చేపడతా మన్నారు. ఇందులో ట్రైనీ కలెక్టర్, పోలీసు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ● దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా పూర్తి చేయాలి

**ఆదిలాబాద్ అర్బన్:** ధరణి, ప్రజావాణి, అధిక వర్షాలపై తహసీల్దార్లు, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ రాజార్షిషా టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ధరణి, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను ఆగస్టు 15 వరకు ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్ లేకుండా అన్ని మండలాల తహసీల్దార్లు పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించకుండా పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తుల పై మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. అధిక వర్షాల కారణంగా జరిగే నష్టాన్ని ముందుగానే గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులున్నారు.

### ● సీఎం వస్తున్నారని మరమ్మతులు

**ఆదిలాబాద్ అర్బన్:** త్వరలోనే జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్నారన్న సమాచారంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అతుకుల బొంతగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించే అవకాశం ఉండడంతో సంబంధిత శాఖల అధికారులు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరానికి వెళ్లే రోడ్డు మరమ్మతు పనులను చేపట్టారు. కార్యాలయం చుట్టు బీటీ రోడ్డును నిర్మిస్తున్నారు. అధికారుల ఆదేశాలతో చకచకగా పనులు సాగిపోతున్నాయి. ఇప్పటికే ఆయా శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు.

# మెరుగైన విద్యతో పాటు భోజనం అందించాలి

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్, జూలై 19: ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న క్రీడా పాఠశాలతో పాటు, పారిశ్రామిక శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన ప్రమాణాలతో కూడిన విద్యానందించాలన్నారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతూ.. పాఠశాలలో అందిస్తున్న విద్య, వైద్య భోజన సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు క్యూలో నిలబడి పల్లెంలో ఆహారం తీసుకొని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని సూచించారు.సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాల న్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతీరోజు వంటగది, స్టోర్‌రూం, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. అంతేకాకుండా వర్షాకాలంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

పరిసరాలలో వర్షపు నీరునిలువ ఉండకుండా చూడాలని సూచించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం అదే ప్రాంగణంలో ఉన్న ఐటీఐ కళాశాలను సందర్శించారు. కళాశాలలో గల పరికరాలు, యంత్రాలను పరిశీలించారు. వర్క్‌షాపులో యంత్రాలు తుప్పుపట్టి ఉండడంతో ఎందుకు ఇలా అయ్యాయని ప్రశ్నించారు. గిరిజన ప్రాంతాల విద్యార్థులను చేర్చుకొని సాంకేతిక విద్య శిక్షణ ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటీడీవో క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.



చప్రాలలో సీఎం రేవంత్‌రెడ్డికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

## రైతు రుణమాఫీతో చరిత్ర సృష్టించిన సీఎం రేవంత్‌రెడ్డి : కంది

జైనథ్, జూలై 19: తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారంగా రైతు రుణమాఫీతో చరిత్ర సృష్టించిందని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం బేల మండలంలోని చప్రాల గ్రామంలో రైతు రుణమాఫీ సంబరాలను రైతులు నాయకులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎడ్లబండి ర్యాలీ నిర్వహించిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. దివంగత సీఎం వైఎస్ తర్వాత తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి రైతులను బ్యాంకుల నుంచి రక్షించిందని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి సీనియర్ నాయకులు గిమ్మా సంతోష్‌రావు, యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంజయ్‌లతో పాటు నాయకులు, చప్రాల గ్రామ రైతులు పాల్గొన్నారు.

## 'మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలి'

ఆదిలాబాద్ రూరల్, జూలై 19: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు, ఎండీఎం వర్కింగ్ ప్రెసిడెంట్ కుంటల రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని భీంసరి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. కార్మికులకు శ్రమ దోపిడి చేయకుండా సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ప్రభుత్వమే కోడి గుడ్లను సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవగాహన

ఆదిలాబాద్ రూరల్, జూలై 19: జిల్లా మహిళా సాధికారత కేంద్రం, సఖి కేంద్రం సంయుక్తంగా జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గజిటెడ్ నెం.1లో శుక్రవారం విద్యార్థులకు మహిళ సాధికారత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళ సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ యశోద మాట్లాడుతూ.. బేటి బచావో బేటి పడావో పథకం, మిషన్ శక్తి పథకం, అంటు వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ క్రైమ్‌పై టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నీలదేవి, సఖీ కేంద్రం కేసు వర్కర్ నాగమణి, సఖి కేంద్రం సిబ్బంది ప్రవీణ, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ యశోద

## రెండున్నర ఏళ్లు పైబడిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రానికి పంపండి

● కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్ పిలుపు

ఖానాపూర్, జూలై 19 : రెండున్నర ఏళ్లు పైబడిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్ పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రాముఖ్యతపై శుక్రవారం ఖానాపూర్ పట్టణంలో నిర్వహించిన ఇంటింటా ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలలో నర్సరీ విద్యను ప్రవేశపెడుతుందన్నారు. ప్రైవేట్ స్కూల్ వద్దని అంగన్‌వాడీలే ముద్దనే నినాదంతో అంగన్‌వాడీ కేంద్రాల ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించారు. నర్సరీ విద్యాభ్యాసానికి ప్రైవేట్ స్కూళ్లకు పంపించే చిన్నారులను ఇకపై అంగన్‌వాడీ కేంద్రాలకే పంపించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీపాద శేషాద్రి, తోట భీమేష్, మెప్మా ఆర్‌బి. వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు ధనలక్ష్మి, మల్లేశ్వరి, ఆశా వర్కర్ లక్ష్మి, ఆయా చంద్రకళ, తదితరులున్నారు.

## కుక్కల బెడద లేకుండా చూడాలి



మామడ గ్రామంలో భారీగా సంచరిస్తున్న కుక్కలు



మామడ, జూలై 19 : మండల కేంద్రంలో కుక్కల బెడదను నివారించాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీవో లింబాద్రికి గ్రామస్థులు ఆశన్న, వీడీసీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని ప్రధాన వీధుల వెంట కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ దాడికి ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. దీనివల్ల తీవ్ర ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. కావునా కుక్కల బెడద నివారించాలని కోరారు. దీనికి ఎంపీడీవో సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

## తెలంగాణలోని కళాకారులకు వేయికోట్లు మంజూరు చేయాలి

నిర్మల్ కల్చరల్, జూలై 19 : తెలంగాణలోని కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం వేయికోట్ల రూపాయలు మంజూరు చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపెల్లి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్మల్‌లో తెలంగాణ కళాకారుల సంక్షేమ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కళాకారులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. సాంస్కృతిక శాఖ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. రామకృష్ణ, నాయకులు కే. సత్యనారాయణ, మల్లేష్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా అంగన్‌వాడీలు

నిర్మల్ కల్చరల్, జూలై 19 : ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయని ఐసీడీఎస్ పీవో నాగమణి అన్నారు. శుక్రవారం బాగులవాడలోని రెండో కేంద్రంలో అమ్మ మాట - అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. పిల్లలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ రెండేళ్లు దాటిన పిల్లల పేర్లు నమోదు చేసుకున్నారు. బాలింతలు, గర్భిణీలకు అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలు వివరించారు. సూపర్‌వైజర్లు సావిత్రి, రజనీదేవి, టీచర్లు రత్నమాల, శకుంతల, రాజమణి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## దుబాయ్‌లో అనారోగ్యంతో ఒకరు మృతి

సారంగాపూర్, జూలై 19 : మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్(30) అనే వ్యక్తి దుబాయ్‌లో అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత కొన్ని సంవత్సరాల క్రితం బ్రతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లిన లక్ష్మణ్ అనారోగ్యంతో మృతి చెందినట్లు దుబాయ్‌లో ఉన్నటువంటి స్నేహితులు ఫోన్‌లో సమాచారం అందించినట్లు తెలిపారు.

# ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తాం

● ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జుట్టు గజేందర్

ముథోల్, జూలై 19 : ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించి, విద్యాశాఖలో పూర్తిస్థాయిలో పదోన్నతుల కొరకు ఎస్టీయూ కృషి చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జుట్టు గజేందర్ అన్నారు. సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఆయా పాఠశాలలను సందర్శించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం పట్ల సానుకూలంగా ఉందన్నారు. అర్హులైన ఉపాధ్యాయులకు, జూనియర్ లెక్చరర్లు, ఎంఈవో, డిప్యూటీ ఈవో, డైట్ లెక్చరర్ల పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వంతో మాట్లాడతామన్నారు. తొలి ఉపాధ్యాయ సంఘంగా ఎస్టీయూ ఉపాధ్యాయుల హక్కులను పరిరక్షించిందని, అనేక సమస్యలు సాధించిందన్నారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. బదిలీ అయి రిలీవ్ కాని ఎస్‌జీటీ టీచర్లను ప్రత్యామ్నాయ పద్ధతులతో వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని డీఏలను సత్వరం విడుదల చేయాలని కోరారు. 40 శాతం ఫిట్‌మెంట్‌తో నూతన పీఆర్‌సీని అమలు చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో సర్వీస్ పర్సన్లను నియమించి, పాఠశాల పరిశుభ్రతను కాపాడాలన్నారు. ఇటీవల నిర్వహించిన పదోన్నతుల్లో సాంకేతిక కారణాలతో మిగిలిపోయిన ఖాళీలకు



సంఘ సభ్యత్వ నమోదు చేస్తున్న దృశ్యం

పదోన్నతులు కల్పించాలని కోరారు. పాఠశాలలకు అవసరమైన విద్యా వాలంటీర్లను, పారిశుధ్య సిబ్బందిని నియమించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. భూమన్న యాదవ్, జే. లక్ష్మణ్, నాయకులు ఎన్. నాగభూషణ్, టి. గంగాధర్, ఏ. బాజిరెడ్డి, రమేష్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ఏకకాలంలో రుణమాఫీ కాంగ్రెస్‌తోనే సాధ్యమైంది

● ఖానాపూర్ ఏసీఎస్ చైర్మన్ ఇప్ప సత్యనారాయణ

ఖానాపూర్, జూలై 19 : తెలంగాణ రాష్ట్రంలో రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయడం కాంగ్రెస్‌తోనే సాధ్యమైందని ఖానాపూర్ పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప సత్యనారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బీర్నంది గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం రైతు రుణమాఫీ అమలు చేసినందున ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుల ఫోటోలతో కూడిన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆగస్టు 15వ తేదీ లోపు రూ. 2 లక్షల రుణమాఫీని విజయవంతంగా తమ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరుపేద ప్రజల పక్షాన నిలుస్తూ ప్రజల హృదయాలను గెలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజు, డాక్టర్ శంకర్‌తో పాటు పార్టీ కార్యకర్తలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

### బ్యాంకు వద్ద మిఠాయిలు పంచుతున్నరైతులు

దిలావర్‌పూర్, జూలై 19 : రుణాలు మాఫీ అయిన రైతులు శుక్రవారం దిలావర్‌పూర్‌లోని బ్యాంకు వద్ద స్వీట్లు పంచారు. శుక్రవారం బ్యాంకుకు వచ్చిన రైతులు రుణమాఫీలో తమ పేర్లను చూసుకుని మురిసిపోయారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసి రైతులకు అండగా నిలబడడం మరిచిపోలేమన్నారు. రూ. రెండు లక్షలు ఒకే దఫాలో మాఫీ చేయడం మాటలు కాదన్నారు. భవిష్యత్తులో రైతుల కోసం సీఎం రేవంత్ రెడ్డి మరింత సహకారం అందిస్తాన్న ఆశాభావం వ్యక్తం చేశారు.



రుణమాఫీ సందర్భంగా మిఠాయిలు పంచుతున్న రైతులు

# నల్ల పోచమ్మ ఆలయ కమిటీ ఎన్నిక

ఖానాపూర్, జూలై 19 : మండల కేంద్రంలోని నల్లపోచమ్మ ఆలయ కమిటీ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా కల్వకుంట్ల నారాయణ, గౌరవ అధ్యక్షులుగా కావలి సంతోష్, ప్రధాన కార్యదర్శిగా బక్కశెట్టి లక్ష్మణ్, కోశాధికారిగా సిరిపురం నాగరాజు, ఉపాధ్యక్షులుగా బీసీ రాజన్న, ఇస్తారి రాములు, జాయింట్ సెక్రటరీగా రాచమల్ల రాజశేఖర్, ఉప కోశాధికారిగా రాజేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొండ ప్రశాంత్, ప్రచార కార్యదర్శిగా ఘంటసాల గంగాధర్, కార్య వర్గ సభ్యులుగా జక్కుల నాగరాజు, కడకుంట్ల రవి, చిలుకూరి ఇస్తారి, కత్తెరపాక రాజేశ్వర్, తిరు పతి, ముఖ్య సలహాదారులుగా కడకుంట్ల నర్సింలు, దాసరి బాపన్న, నారపాక నర్సయ్య, సిరి గారపు లింగన్న, భూక్యా కాశీరాం, మంత్రరాజం దేవేందర్, ధ్యావతి రాజేశ్వర్, కూచంపల్లి గంగాధర్, మేసు రాజేశ్వర్, బుట్టి లక్ష్మణ్, సోన్నాయిల రవి, సుంకరపల్లి లక్ష్మణ్ తదితరులు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లా డుతూ... ఆలయ అభివృద్ధి కోసం తమవంతుగా కృషి చేస్తామన్నారు.

## పొట్టపెల్లిలో మొక్కలు నాటిన ఎస్సై

లక్ష్మణచాంద, జూలై 18 : మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో ఎస్సై సుమలత శుక్రవారం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరోణ కోసం ఐక్యరాజ్య సమితి సూచనపై కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'వన మహోత్సవం' అనే పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టిన సంగతి అందరికి తెలిసిందే. ఈ కార్యక్రమంలో భాగంగా ఆమె స్థానిక గ్రామ పంచాయతీ, పాఠశాల ఆవరణలో తన సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. తద్వారా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలనే సందేశం ఇచ్చారు.

# గురుపౌర్ణమి ఉత్సవాలు ప్రారంభం



అఖండ సాయినామంలో పాల్గొన్న భజన మండలి

నిర్మల్ కల్చరల్, జూలై 19 : నిర్మల్‌లోని గండి రామన్న సాయిబాబా ఆలయంలో శుక్రవారం గురుపౌర్ణమి ఉత్సవాలు ఉదయం ప్రారంభించారు. 48 గంటలపాటు అఖండ సాయినామ పారాయణం గావిస్తారు. ఆదివారం వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయని సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి తెలిపారు. పూజా కార్యక్రమంలో ఆయనతో పాటు ఆలయ ఈవో రమేష్, భక్తులు పాల్గొన్నారు. పలు ప్రాంతాల నుండి భజన మండళ్లు వచ్చి సాయినామ పారాయణం చేయనున్నారు.

## వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలి : ఎస్ఎఫ్ఐ

నిర్మల్ కల్చరల్, జూలై 19 : ప్రభుత్వ వసతి గృహానికి సొంత భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ వసతి గృహాన్ని విద్యార్థి నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దిగంబర్ మాట్లాడుతూ... విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కరువయ్యాయన్నారు. బాత్రూంలు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. హాస్టల్ ప్రారంభమై నెల రోజులైనా దోమ తెరలు, బెడ్ షీట్లు అందజేయలేదని ఆరోపించారు. కాస్మొటిక్ చార్జీలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని లేనట్లయితే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్తీక్, రాహుల్, తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి వాడలో పిచ్చి మొక్కల తొలగింపు




మహాలక్ష్మి వాడలో డ్రై డే నిర్వహిస్తున్న ఆరోగ్యశాఖ

నిర్మల్ కల్చరల్, జూలై 19 : నిర్మల్ పట్టణం బంగల్‌పేట్ పరిధిలోని మహాలక్ష్మి వాడలో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. ఉప వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్ ఆధ్వర్యంలో ఆ ప్రాంతంలో పిచ్చి మొక్కలు తొలగించారు. రోడ్లపై నిలిచిపోయిన నీరు తొలగించి పరిసరాలు శుభ్రపరిచారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ... వర్షాకాలం దృష్ట్యా ప్రజలు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులు దరిచేరవన్నారు. సూపర్‌వైజర్ భోజన్న, మహేందర్, రాములు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీఆర్ఏ వారసులకు ఉద్యోగ నియామక ఉత్తర్వుల కోసం వినతి

నిర్మల్ కల్చరల్, జూలై 19 : నిర్మల్ జిల్లాలో 61 ఏళ్లు నిండిన వీఆర్ఏల వారసులకు ప్రభుత్వ ఉద్యోగ నియామక ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావుకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో 3,797 మంది వీఆర్ఏలున్నారని వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. వారి సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని శ్రీహరిరావు హామీ ఇచ్చారు.





# సీఎంఆర్‌లో ఆగని మిల్లర్ల చేతివాటం

- జిల్లాలో రెండు రైస్‌మిల్లులపై కేసులు
- పెనాల్టీ చెల్లింపులోనూ అవకతవకలు
- టెండర్‌లు నిర్వహించినా.. ధాన్యాన్ని లిఫ్ట్ చేయని మిల్లర్లు
- తనిఖీలపై రాష్ట్ర సర్కారు ప్రత్యేక దృష్టి

నిర్మల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రైస్‌మిల్లర్ల చేతివాటం పతాకస్థాయికి చేరుకుందన్న ఆరోపణలున్నాయి. సంబంధితశాఖ అధికారుల హెచ్చరికల మాట దేవుడెరుగు కానీ ఏకంగా రాష్ట్ర ప్రభుత్వమే సీఎంఆర్ విషయంలో కఠినచర్యలు తీసుకుంటామని చేసిన హెచ్చరికలు సైతం బేఖాతరవుతున్నాయి. జిల్లాలో కొంతమంది రైస్‌మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి ఇష్టారాజ్యంగా వ్యవహరించడమే కాకుండా కోట్ల రూపాయల సీఎంఆర్ ధాన్యాన్ని పక్కదారి పట్టించారన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దాదాపు మూడేళ్ల నుంచి రైస్‌మిల్లర్లు పెద్దఎత్తున అవకతవకలకు పాల్పడుతున్నప్పటికీ వారిపై నామమాత్రపు చర్యలే తప్ప కఠినచర్యలు లేకపోవడంతో అక్రమాలకు మరింత ఆస్కారమిస్తోందని అంటున్నారు. అయితే ఇటీవల సీఎంఆర్ విషయంలో అవకతవకలకు పాల్పడిన రెండు రైస్‌మిల్లులపై అధికారులు కేసులు నమోదు చేసినప్పటికీ పరిస్థితుల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించడం లేదు. 2022-2023 ఖరీఫ్‌సీజన్‌కు సంబంధించి 4629 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ముథోల్ ప్రాంతానికి చెందిన ఓ రైస్‌మిల్లు బకాయి ఉంది. అలాగే బాసరకు చెందిన మరో రైస్‌మిల్లు కూడా 2022-2023 ఖరీఫ్, రబీసీజన్‌కు సంబంధించి 9449 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సర్కారుకు అందించాల్సి ఉన్నప్పటికీ సదరు యాజమాన్యం దీనిని పెద్దగా పట్టించుకోలేదు. అధికారులు పలుసార్లు నోటీసులు జారీ చేసి హెచ్చరించినప్పటికీ ఆ హెచ్చరికలను బేఖాతరు చేశారు. దీంతో అధికారులు ఆ మిల్లుపై కూడా కేసు నమోదు చేశారు. అలాగే 2022-2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం 34 రైస్‌మిల్లులకు 125 శాతం పెనాల్టీని విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సీజన్‌లో 1,68,177 మెట్రిక్ టన్నుల ధాన్యంను సీఎంఆర్ కోసం రైస్‌మిల్లులకు అందించారు. దీనికి అనుగుణంగా రైస్‌మిల్లర్లు 1,13,000 సీఎంఆర్ బియ్యాన్ని అందించాల్సి ఉంది. ఇప్పటి వరకు 95,121 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని రైస్‌మిల్లర్లు అప్పగించినప్పటికీ ఇంకా 17,887 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అందించాల్సి ఉంది. ఇటీవలే పది రైస్‌మిల్లులు 4600 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని అందించినప్పటికీ ఇంకా 24 రైస్‌మిల్లులు 13,251 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అప్పగించాలి. మొత్తం 17,723 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించిన బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది. వీరికి ప్రభుత్వం సెప్టెంబరు 30 వరకు గడువును విధించింది. అలాగే 2022-2023 రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యానికి ప్రభుత్వం ఇటీవల వేలం పాట నిర్వహించింది. 1,50,300 మెట్రిక్ టన్నుల ధాన్యానికి వేలం పాట నిర్వహించినప్పటికీ ఇందులో నుంచి కేవలం 2100 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే మిల్లర్లు డిప్ట్ చేశారు. ఇంకా 1,48,220 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని డిప్ట్ చేయాల్సి ఉంది.

### రెండు మిల్లులపై కేసుల నమోదు

కాగా జిల్లాలో నిబంధనలు అతిక్రమించి సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించని రెండు మిల్లులపై అధికారులు కొరఢా ఝులిపించారు. ముథోల్, బాసరకు చెందిన ఈ రైస్‌మిల్లులపై మొదటి నుంచి అనేక ఆరోపణలున్నాయి. అయితే అధికారులు చేసిన హెచ్చరికలను బేఖాతరు చేస్తూ సదరు యాజమాన్యాలు తమ చేతివాటాన్ని ప్రదర్శించడంతో అధికారులు రంగంలోకి దిగే పరిస్థితి ఏర్పడింది. 2022-2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 4629 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ముథోల్ ప్రాంతానికి చెందిన ఓ రైస్‌మిల్లు బకాయి ఉంది. అలాగే బాసరకు చెందిన మరో రైస్‌మిల్లు కూడా 2022-2023 ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించి 9449 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సర్కారుకు అందించాల్సి ఉన్నప్పటికీ సదరు యాజమాన్యం దీనిని పెద్దగా పట్టించుకోలేదు. అధికారులు పలుసార్లు నోటీసులు జారీ చేసి హెచ్చరించినప్పటికి ఆ హెచ్చరికలను బేఖాతరు చేశారు. దీంతో అధికారులు ఆ మిల్లుపై కూడా కేసు నమోదు చేశారు.

### వేలం పాట నిర్వహించినా పట్టించుకోని మిల్లర్లు

ప్రభుత్వం 2022-2023 రబీసీజన్‌కు సంబంధించి ధాన్యం కోసం వేలం పాటను నిర్వహించి మొత్తం 1,50,300 మెట్రిక్ టన్నుల ధాన్యానికి టెండర్ నిర్వహించింది. ఈ టెండర్‌ను దక్కించుకున్న రైస్‌మిల్లర్లు ఆ తరువాత ఆ ధాన్యాన్ని లిఫ్ట్ చేయకుండా జాప్యం చేస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటి వరకు కేవలం 2100 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే మిల్లర్లు వ్యూహాత్మకంగా లిఫ్ట్ చేసి మిగతా ధాన్యం విషయంలో స్పందించకపోతుండడంపై చర్చ జరుగుతోంది. ఇంకా 1,48,220 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని రైస్‌మిల్లర్లు లిఫ్ట్ చేయాల్సి ఉంది. దీంతో పాటు పెనాల్టీ విధించినప్పటికీ 17,723 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇవ్వకుండా పథకం ప్రకారం జాప్యం చేస్తున్నారని అంటున్నారు. అయితే పెనాల్టీ విధించిన ధాన్యానికి ప్రభుత్వం సెప్టెంబరు 3 వరకు గడువును విధించింది. మరో రెండు నెలన్నర నెలల పాటు గడువు ఉన్నప్పటికీ ఆ గడువులోగా కూడా మిల్లర్లు పెనాల్టీని చెల్లించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయంటున్నారు.

### తనిఖీల కోసం మారిన పద్ధతులు

అవకతవకలకు పాల్పడుతున్న రైస్‌మిల్లులపై చర్యలు తీసుకునేందుకు జిల్లా స్థాయి అధికారులు వెనకాడుతున్న కారణంగా ప్రభుత్వం తనిఖీలకు సంబంధించి కొత్తపద్ధతిని తెరపైకి తెస్తోంది. ఇందులో భాగంగానే ఒక జిల్లాకు చెందిన అధికారులను తమకు సంబంధం లేని మరో జిల్లాకు తనిఖీల కోసం పంపుతూ ఆ తనిఖీలకు సంబంధించిన నివేదికలను ఆ అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఎప్పటికప్పుడు రాష్ట్ర స్థాయి అధికారులు సమీక్షలు జరుపుతున్నారు. దీని కారణంగా రైస్‌మిల్లుల అక్రమాలతో పాటు వాస్తవ పరిస్థితులు వెలుగుచూస్తున్నాయంటున్నారు. మరికొద్ది రోజుల్లో రైస్‌మిల్లర్ల అవకతవకలపై అధికారులు పకడ్బందీగా మూకుతాడు విధించబోతున్నారని సమాచారం.

## ఆది గురువు వ్యాస మహర్షే

- ఆధ్యాత్మిక ప్రవచన కర్త శశికాంత్ జోషి



ప్రవచనకర్తను సన్మానిస్తున్న ఆలయ పండితులు, అధికారులు

బాసర, జూలై 19 : మానవాళికి ఆదిగురువు వ్యాసమహర్షే అని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త శశికాంత్ జోషి అన్నారు. గురుపౌర్ణమి ఉత్సవాలను పురస్కరించుకొని వ్యాసమహర్షి ఆలయంలో వ్యాసవైభవం, గురుతత్వం అనే విషయంపై ప్రవచనాలు ఇచ్చారు. జగతికి వేదాలను ఇతర పురాణాలను అందించిన వ్యాస భగవానుడే తొలి గురువని చెప్పారు. వ్యాసమహర్షి రచించిన వేదాలే నేటి మానవులకు మార్గదర్శకాలుగా ఉన్నాయని అందుకే ఆయనకు వ్యాసమహర్షి అని పేరు వచ్చిందని అన్నారు. అలాంటి వ్యాస భగవానుడు బాస ర వచ్చి ఇక్కడ తపస్సు చేయడంతో ఈ పుణ్య క్షేత్రానికి ఎంతో విశిష్టత ఏర్పడిం దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పండితులు, అధికారులు, దేవస్థాన పండితులు భక్తులు పాల్గొన్నారు.

### గురు పౌర్ణమి వేడుకలు ప్రారంభం

బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధిలో గురుపౌర్ణమి వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సరస్వతి అమ్మవారికి అభిషేక పూజలు నిర్వహించారు. చండి హోమం, గణపతి పూజ, వివిధ పూజలను ఆల య పండితులు నిర్వహించారు. మూడురోజుల పాటు ఈ పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. ఉత్సవాల చివరి రోజు ఆదివారం గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని వ్యాసమహర్షి ఆలయంలో ప్రత్యేకపూజలు ఉంటాయని అన్నారు.

### ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకొని బాసర అమ్మవారిని శుక్రవారం ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్ సందర్శించారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల ప్రారంభో త్సవాల కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

### గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి ప్రారంభమైన వరద

- 324 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



భైంసా, జూలై 19 : ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల మూలంగా గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి శుక్రవారం వరద నీటి చేరిక ప్రారంభమయ్యింది. వర్షాకాలం ప్రారంభమైన నెలన్నర రోజుల తదుపరి ప్రాజెక్టులోకి వరద నీటి చేరిక జరిగింది. మొత్తం 324 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. ఈ క్రమంలో గురువారం ప్రాజెక్టు నీటిమట్టం 355.7 మీటర్లు ఉండగా ఇన్‌ఫ్లో కొనసాగిన కారణంగా నీటి మట్టం 0.1 మేర పెరిగి శుక్రవారం నాటికి 355.8 మీటర్లకు పెరిగింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 358.7 మీటర్లుగా ఉంది.

## అటవీశాఖ సిబ్బందికి రోడ్డు ప్రమాదం



గాయాలపాలైన అటవీ సిబ్బంది

నిర్మల్ కల్చరల్, జూలై 19 : సోన్ చెక్‌పోస్ట్ వద్ద పనిచేస్తున్న అటవీశాఖ సిబ్బంది తనిఖీలు చేస్తుండగా శుక్రవారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆపకుండా వెళ్తున్న వాహనాన్ని పట్టుకునే ప్రయత్నంలో కారును ఢీకొని క్రింద పడిపోయారు. వారికి గాయాలయ్యాయి. నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అల్లూరి మల్లారెడ్డి ఆ సమయంలో హైదరాబాద్ వెళ్తుండగా గమనించి గాయాల పాలైన అటవీ సిబ్బందిని అంబులెన్స్‌ను రప్పించి చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. కాంగ్రెస్ నాయకులు కీజర్ సహకరించాడు.

## రైతుల్లో వెలుగులు నింపింది కాంగ్రెస్

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కూచాడి



సారంగాపూర్‌లో మాట్లాడుతున్న కూచాడి

సారంగాపూర్, జూలై 19 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ. రెండు లక్షల రైతు రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో ఏకకాలంలో రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు పేదలకు 200 యూనిట్ల ఉచిత కరెంటు, తదితర హామీలన్నీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తుందని పేర్కొన్నారు. రైతులకు రూ. లక్షలు రైతుల జీవితాల్లో వెలుగులు నింపడం జరిగిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ నాలుగు దఫాలుగా రుణమాఫీ చేస్తే ఒకేసారి రైతు రుణమాఫీ చేయడం దేశ చరిత్రలోనే సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తమ ప్రభుత్వాన్ని నిందించే ముందు ఆత్మ విమర్శన చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం కూచాడి భాస్కరరావు జ్ఞాపకార్థం ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి మొదటి వార్షికోత్సవానికి హాజరయ్యారు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సిబ్బంది ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, నారాయణ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆది, బి.నర్సయ్య, నక్కరాజన్న, మారుతిలతో పాటు నాయకులు, కార్యకర్తలు, రైతులు ఉన్నారు.

### రైతు ముఖంలో చిరునవ్వు చూడడమే ప్రభుత్వ లక్ష్యం

**మామడ** : రైతు ముఖంలో చిరునవ్వు చూడడమే ప్రభుత్వ లక్ష్యమని నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మండలంలోని పొన్కల్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ సంబరాల కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ, సోనియాగాంధీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో అమలవుతున్న పథకాలు దేశంలో ఎక్కడా లేవని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణమాఫీ చేసిందని, రైతు ముఖంలో ఆనందం వెదజల్లుతుందన్నారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి దేశంలోనే తెలంగాణ ప్రభుత్వం అగ్రగామిగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ లింగారెడ్డి, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ పీవీ రమణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశానికి హాజరైన అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, జూలై 19 : కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రిన్సిపాల్స్ ప్రత్యేక అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రత్యేక అధికారులంతా నిరంతరం కేజీబీవీలను తనిఖీలు చేయాలని, సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీలకు సంబంధించిన సమాచార నివేదికలను అందజేయాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, నాణ్యతను తెలుసుకోవాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం, అల్పాహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వంటగదిని ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచాలని, వంటకు నాణ్యమైన కూరగాయలను, వస్తువులను మాత్రమే వాడాలని సూచించారు. కిచెన్‌గార్డెన్‌లను నిర్వాహించాలని, ప్రతి కేజీబీవీలో రక్షణగోడ, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ లాంటి సౌకర్యాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలల్లో అన్ని రకాల కమిటీలను ఏర్పాటు చేసి ఇందులో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెందకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, ఫాగింగ్, ఆయిల్‌బాల్స్ వేయాలన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించాలని, ప్రతి కేజీబీవీలో అనారోగ్యబారిన పడిన విద్యార్థులకు ప్రత్యేకగదిని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతీ కేజీబీవీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని, ఉన్నత ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం మండలాల వారీగా కేజీబీవీలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను, సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలు, తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రవీందర్‌రెడ్డి, ప్రత్యేక అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలకు పోటీ : బీజేపీ




మాట్లాడుతున్న అల్లాపూర్ శ్రీనివాస్

నిర్మల్ కల్చరల్, జూలై 19 : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాలకు పోటీ చేస్తుందని ఆ పార్టీ పార్లమెంటరీ ప్రభారీ అల్లాపూర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్మల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పతాకావిష్కరణ చేసి నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి అధ్యక్షతన కొనసాగిన సమావేశానికి ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలో బీజేపీకి అనుకూల పరిస్థితులున్నాయని వారు పేర్కొన్నారు. మంచి మెజారిటీతో అధిక స్థానాలు కైవసం చేసుకుంటామన్న ధీమా వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు స్థానిక సమస్యలపై పోరాటాలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటి నుండే ప్రణాళికలు రచించుకోవాలని సూచించారు. పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్, ప్రధాన కార్యదర్శులు సామ రాజేశ్వర్ రెడ్డి, మేడిసెమ్మె రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల్, రవి పాండే, గంగారెడ్డి, హరినాయక్, రమణారెడ్డి, రామారావు, జిల్లా పదాధికారులు, అసెంబ్లీ కన్వీనర్లు, పార్టీ మండల అధ్యక్షులు సమావేశానికి హాజరయ్యారు.

## ప్రణాళికబద్ధమైన విధానాలతో దశలవారీగా అభివృద్ధి



భైంసాలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

భైంసా, జూలై 19 : ప్రణాళికబద్ధమైన విధానాలతో దశలవారీగా అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం భైంసాలో విశ్రాంతి భవన ఆవరణలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రాధాన్యాతనుసారం ప్రగతి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని వివరించారు. ఇందులో బీజేపీ ప్రతినిధులు సాంఘ్లీ రమేష్, బాలాజీ పాటిల్, వెంగళ్‌రావ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### నర్సాపూర్ (జి)లో చెక్కుల అందజేత

**నర్సాపూర్(జి)**: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ముథోల్ ఎమ్మెల్యే రాంరావ్ పటేల్ లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమలో ఎంపీడీవో పుష్పలత, డిప్యూటీ తహసీల్దార్ వహీద్, గిర్దావర్ సుమలత, నాయకులు వినోద్‌రెడ్డి, అర్జున్ ఠాకూర్, అవర్గ సాయన్న, నరేందర్, దత్తురాం, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

### ఉపకార వేతనాలకు దరఖాస్తు చేయాలి

నిర్మల్ కల్చరల్, జూలై 19 : బీడీ కార్మికుల పిల్లలు ఉపకార వేతనాల కోసం 31 ఆగస్టులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ ఎన్. మహేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఉపకార వేతనాలు అందిస్తుదన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దిలావర్‌పూర్, జూలై 19 : మండల కేంద్రంలోని 33/ 11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని దిలావర్‌పూర్, లోలం, మాడేగాం, కదిలి గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిచి వేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని అన్నారు. వ్యవసాయ, గృహ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



అదుపు తప్పి కింద పడ్డ నాగయ్య

దిలావర్‌పూర్, జూలై 19 : మండలంలోని 61వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. లోకల్ వెల్మాల్ గ్రామానికి చెందిన అంకుల నాగయ్య నర్సాపూర్(జి) మండలం రాంపూర్‌లో మృతి చెందిన సమీప బంధువు అంత్యక్రియలకు హాజరై తన ద్విచక్ర వాహనంపై తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా దిలావర్‌పూర్ పాత బస్టాండ్ సమీపంలో అకస్మాత్తుగా ఆవు రోడ్డు పైకి రాగా ఆవును తప్పించబోయి అదుపు తప్పి కింద పడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

### జిల్లాలో కురుస్తున్న వర్షాలు

నిర్మల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రోజున జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లా సగటు వర్షపాతం 32.4 మిల్లీ మీటర్లు నమోదు కాగా, జిల్లాలో అత్యధికంగా కడెం మండలంలో 118.6 మిల్లీమీటర్లు వర్షంపాతం నమోదైంది. అలాగే పెంబి మండలంలో 87 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా దస్తురాబాద్ మండలంలో 56.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇదిలా ఉండగా జిల్లాలోని ప్రధానమైన మూడు ప్రాజెక్టుల్లోకి ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వచ్చి చేరుతుంది. కడెం మండలం పూర్తిస్థాయి నీటిమట్టం 700ల అడుగులు కాగా ప్రస్తుతం 688.575 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి 4,108 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. అలాగే స్వర్ణ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1183 అడుగులు కాగా ప్రస్తుతం 1173.7 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి 270 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది.